క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పోలి స్వర్గం పూజలు



కె. ఉప్పలపాడు శివాలయంలో పోలి స్వర్గం దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కొండపి: మండలంలో పోలి స్వర్గం పూజలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం మార్గశిర మాస శుక్ల పక్ష పాడ్యమి తిథి సందర్భంగా పోలి స్వర్గం వేడుకలు నిర్వహించారు. మహిళలు తెల్లవారుజాము నుంచే గ్రామ పరిసరాల్లో ఉన్న బావుల వద్ద స్నానం చేసి పోలి స్వర్గ కథను స్మరించి తోటి వారికి తెలియజేశారు. అరటి ఒదుల్లో ఆవు నెయ్యితో దీపాలు వెలిగించారు. కె. ఉప్పలపాడు శివాలయంలో అర్చకులు రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో పోలి స్వర్గ వేడుకలు నిర్వహించారు. మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరిరూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్, గుడ్‌హెల్ప్ సంస్థల ఆధ్వర్యంలో స్థానిక పామూరు బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్, వివిధ సంస్థల ప్రతినిధులు రమేష్, నవకుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పలు వీధుల్లో చైర్మన్ గఫార్, మున్సిపల్ అధికారులు పర్యటించారు. డ్రైనేజీ కాలువల్లో చెత్త, వ్యర్థాలు వేయకుండా అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలని సూచించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు



ఆటోలను తనిఖీ చేస్తున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపినా, లైసెన్సు లేకుండా, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. కంభం, కనిగిరి రహదారి వాహనాలను సోమవారం తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని పరిశీలించారు. మద్యం తాగి అతి వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

విద్యుదాఘాతానికి తీవ్ర గాయాలు



క్షతగాత్రుడు యలమందబాబు

కనిగిరిరూరల్: విద్యుదాఘాతానికి ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే..పట్టణంలోని చెప్పుల్ బజార్‌లో ఉన్న ఓ రెడీమెడ్ దుస్తుల దుకాణానికి ఏ యలమందబాబు లైటింగ్ డెకరేషన్ చేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ లైన్ ప్రధాన సప్లయ్ వైరు ప్రమాదవశాత్తు అతని కుడిచేయికి తగిలింది. దీంతో యలమందబాబు మిద్దెపై నుంచి జారి కింద పడ్డాడు. ప్రమాదంలో తలకు, చేతులకు తీవ్ర రక్త గాయాలు కావడంతో క్షతగాత్రున్ని ప్రైవేట్ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

అధ్వాన రోడ్లతో అగచాట్లు



టంగుటూరు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డుపై గుంతలు



టంగుటూరు - పాకల ఆర్‌అండ్‌బీ రోడ్డు



చెరువును తలపిస్తున్న రోడ్డు

- అధ్వానంగా టంగుటూరు – పాకల ఆర్‌అండ్‌బీ రోడ్డు
- చెరువును తలపిస్తున్న టంగుటూరు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం రహదారి
- గుంతలమయమైన రోడ్లతో ప్రజలు, వాహనదారులు అగచాట్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

టంగుటూరు: మండలంలో పలు ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా తయారై ప్రజలకు అగచాట్లు తప్పడం లేదు. ఇటీవల మూడు నెలల నుంచి అడపా దడపా కురుస్తున్న వర్షాలకు రోడ్లు మరింత అధ్వానంగా మారాయి. దీంతో ఈ రోడ్లలో ప్రయాణమంటేనే ప్రజలు జంకే పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా టంగుటూరు–పాకల ఆర్ అండ్‌బీ రోడ్డు, టంగుటూరు సెంటర్, టంగుటూరు సెంటర్‌నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు..ఈ రెండూ రోడ్ల పరిస్థితి వర్షాలకు దారుణంగా ఉన్నాయి. ఈ రోడ్లలో భారీ గుంతలు ఏర్పడటంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. వర్షాలకు ఎటు చూసినా గుంతలు, చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాలకు గురవుతున్నారు.

శాశ్వత పరిష్కారం చూపరా..?

ప్రధాన ఈ రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంటే ఆర్‌అండ్‌బీ అధికారులు మాత్రం నెలకు ఒకసారి గుంతలు పూడ్చి బిల్లులు చేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధ్వానంగా ఉన్న ఈ రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపించడం లేదు. దీంతో రోడ్లపై కొన్ని ప్రాంతాల్లో రెండు అడుగుల మేర గుంతలు ఏర్పడటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్లను మరిచి..విస్తరణ పేరుతో హైడ్రామా

కూటమి ప్రభుత్వం వచ్చాక అటు సంక్షేమ పథకాలు, ఇటు అభివృద్ధి పనులు నత్త నడకన సాగుతున్నాయి. టంగుటూరు – పాకల ఆర్అండ్‌బీ రోడ్డు, టంగుటూరు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు తరచూ ఎదుర్కొంటున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదు. కానీ

టంగుటూర్ సెంటర్లో డివైడరుపై ఉన్న చిరు వ్యాపారస్తులను తొలగించాలని ఇబ్బందులు పెట్టడానికి అభివృద్ధి పనులు పేరిట హైడ్రామా సృష్టిస్తున్నారు. ఆర్టీసీ డిపో నుంచి నుంచి ఫైర్ స్టేషను వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు పేరిట దుకాణదారులని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్‌అండ్‌బీ రోడ్లకు పూర్తిస్థాయిలో మరమ్మతులుచేసి ఇక్కట్లు తీర్చాలని కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ



అయ్యప్ప పడిపూజ

కనిగిరిరూరల్: కొండపై కొలువైయున్న అయ్యప్ప స్వామి దేవస్థానంలో సోమవారం రాత్రి పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్ప దీక్షా మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేక మహోత్సవం, కలశపూజ, హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. మాలధారణ స్వాములు భజన, అగ్నిగుండ ప్రవేశం జరిగాయి. అనంతరం అయ్యప్ప స్వాములకు, శివ స్వాములకు, గోవింద స్వాములకు, భవాని స్వాములకు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. అద్దంకి వెంకటేష్ స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన ఆకట్టుకుంది. స్వాములు, భక్తులు అధిక సంఖ్యలు పాల్గొన్నారు.



అయ్యప్ప పడిపూజకు హాజరైన భక్తులు

మూణ్ణాళ్ల ముచ్చటే..!



నరశింహశ్రేష్టి అడితి రోడ్డు సెంటర్‌లో రోడ్డుపై నీరు నిలిచి చెరువును తలపిస్తున్న రోడ్డు



గ్రంథాలయం రోడ్డు సెంటర్‌లో రోడ్డుపై నిలిచిన నీరు

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ప్రధానరహదారి మరమ్మతు పనులు తూతూ మంత్రంగా చేయడంతో గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. దీంతో ఇటీవల ఆర్‌అండ్‌మీ అధికారులు తారు, సన్న కంకరతో గుంతలను పూడ్చారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మళ్లీ తారు, కంకర లేవడంతో గుంతలు పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు శాశ్వత ప్రాతిపదికన గుంతలు పూడ్చకుండా తూతూ మంత్రంగా గుంతలు పూడ్చటంతో కురిసిన కొద్దిపాటి వర్షానికే మళ్లీ గుంతలు పడ్డాయి. అంతేకాక సన్న కంకర కారణంగా టైర్లు పంక్చర్లు అవుతున్నాయని, చేసే పనులు పటిష్టం గా చేయకుండా తూతూమంత్రంగా చేయటం ఏంటని ప్రజలు అధికారుల పనితీరును విమర్శిస్తున్నారు. తూతూమంత్రంగా పనులు చేయడం వల్ల గతంలో చిన్నపాటి గుంతలు పెద్దవిగా అయ్యాయి. గుంతలు పూడ్చే క్రమంలో చిన్నపాటి గుంతలు పెద్దవిగా మారాయి. దీనికి తోడు గుంతలు పూడ్చే క్రమంలో రోడ్డు పక్క వర్షం నీరు కాలువలోకి పోయే వీలులేకుండా ఉండటంతో ప్రధాన సెంటర్లయిన నరశింహశ్రేష్టి అడితి రోడ్డు సెంటర్, పోలీస్‌స్టేషన్ సెంటర్, మార్కెట్ సెంటర్, గ్రంథాలయం సెంటర్‌లలో గుంతల్లో వర్షం నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇటీవల గుంతలు పూడ్చటంతో సమస్య తీరిందని సంతోషించామని, కానీ ఇప్పుడు రోడ్డు పై వర్షపు నీరు ఉండటంతో గుంత ఎక్కడ ఉందో అర్థం కావడం లేదని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి శాశ్వత ప్రాతిపదికన గుంతలు పూడ్చాలని, వర్షం నీరు రోడ్డుపై నిలబడకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై అర్‌అండ్‌బీ ఏఈ మాధవరావును వివరణ కోరగా..ఇటీవల ఓ కాంట్రాక్టర్ ఉచితంగా గుంతలు పూడ్చారని, కానీ మళ్లీ గుంతలు పడటంతో శాశ్వత మరమ్మతుల కోసం రూ.5 లక్షలతో ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రధాన రహదారికి శాశ్వత ప్రాతిపదికన సుమారు 8 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. ఈ నిధులు మంజూరైతే ప్రధాన రహదారిలో డివైడర్‌కు ఇరువైపులా ఏడు మీటర్లు ఉండేటట్లు సీసీ రోడ్డు నిర్మిస్తామన్నారు.

అధైర్యపడకండి అండగా ఉంటాం



మాలకొండయ్యకు ఆర్థికసాయం అందజేస్తున్న దద్దాల నారాయణ

- వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ

పీసీపల్లి: కార్యకర్తలు అధైర్యపడవద్దని, అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ అన్నారు. మండలంలో సోమవారం పర్యటించి అనారోగ్యంతో బాధపడుతున్న నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి భరోసా ఇచ్చారు. మండల పరిధిలోనే మార్రెళ్ల ఎస్సీ పాలెంలో కిడ్నీలు పాడైపోయి బాధపడుతున్న ఆంధ్ర మాలకొండయ్యను పరామర్శించి వారి కుటుంబానికి భరోసా కల్పించారు. వైద్య ఖర్చు నిమిత్తం రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. మాలకొండయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పెద యిర్లపాడుకి చెందిన పిరెడ్డి రోసిరెడ్డి ఇటీవల కాలికి గాయమై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా ఆయన్ను పరామర్శించారు. విజయనగర కాలనీకి చెందిన వార్డ్ నంబర్ రాజేష్ కిడ్నీలో రాళ్లతో ఇబ్బందులు పడుతుండటంతో పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం పిల్లివారిపల్లికి చెందిన కులికి కొండయ్య కుమార్తె పెళ్లికి హాజరయ్యారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీకాంతం ఓకే రెడ్డి, ఎంపీటీసీ భూమిరెడ్డి కొండారెడ్డి, మైలా కొండయ్య, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, సర్పంచ్ పరిమి వెంకటరావు, ఆదినారాయణ రెడ్డి, సూరా మాలి మాలకొండయ్య, ఉండేలా కృష్ణారెడ్డి, బోగాల మాలకొండారెడ్డి, మూల రాజశేఖర్‌రెడ్డి, మేకల మాల్యాద్రి యాదవ్, బాలసాని మోహన్, నడికట్టు వెంకట్రెడ్డి, వీరం రెడ్డి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం..



రోడ్డు పక్కన పడవేసి ఉన్న నూతన విద్యుత్ స్తంభం



శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం

- విద్యుత్ స్తంభం మార్చకుంటే రోడ్డు పక్కన పడేసిన సిబ్బంది
- పాత స్తంభం శిథిలావస్థకు చేరి జిక్కు.. జిక్కు..

కొండపి: కొండపి పంచాయతీలో విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలపైకి వచ్చే ప్రమాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే.. పంచాయతీలోని విష్ణాలయం వీధిలో విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరింది. విద్యుత్ స్తంభంలోని చువ్వలు బయటికి కనిపిస్తున్నాయి. ఆ విద్యుత్ స్తంభం స్థానంలో నూతన స్తంభాన్ని గతంలోనే మంజూరు చేసిన అధికారులు స్తంభం తీసుకువచ్చి రోడ్డు పక్కన ఉంచారు. అయితే ఇంత వరకు పాత స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని బిగించలేదు. అదే మార్గంలో ప్రతిరోజు విద్యుత్ శాఖ అధికారులు తిరుగుతూనే ఉంటారు. కానీ శిథిలావస్థలో ఉన్న స్తంభాన్ని తొలగించకుండా అలానే ఉంచారు. పాత విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరి ఇనుప చువ్వలు బయటకు రావడంతో పిల్లలు ఆడుకుంటూ వాటిని పట్టుకుంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థలో ఉన్న స్తంభం ఎప్పుడు విరిగి పడుతుందో తెలియక ప్రజలు ఆ ప్రాంతంలో ప్రయాణించే సమయంలో భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి పాత స్తంభాన్ని తొలగించి నూతన విద్యుత్ స్తంభం బిగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

13న మహా దీపోత్సవం

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని కె.బిట్రగుంట కాలభైరవస్వామి దేవస్థానంలో ఈ నెల 13వ తేదీ శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మహా దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త పాపిశెట్టి శ్రీనివాసులు తెలిపారు. అరుణాచలంలో 13వ తేదీ 6 గంటలకు మహాదీపోత్సవం ఉంటుందని, అదే సమయానికి ఆలయంలో దీపోత్సవం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా దీపస్తంభాన్ని నిర్మించామన్నారు. ఈ సందర్భంగా ఉదయం నూతనంగా నిర్మించిన యాగశాల ప్రారంభించి యాగాలు జరిపిస్తామని, సాయంత్రం మహాదీపోత్సవం నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన వేద పండితుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్నదానంలో దాతలకు అవకాశం ఉంటుందని, సాముహికంగా కూడా దాతలు అన్నదానంలో పాల్గొనవచ్చని ఆయన వివరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పామూరు: మండలంలో 132 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జిలానీ తెలిపారు. సింగిల్ ఫేజ్ విద్యుత్ ఉంటుందని, ప్రజలు సహకరించాలని ఏఈ కోరారు.

‘అదనపు విధులతో ఇబ్బందులు పడుతున్నాం’

- పంచాయతీ విధుల నుంచి మినహాయించాలని వీఆర్‌ఓల వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం వీఆర్‌ఓలు

పామూరు: పంచాయతీ విధుల నుంచి వీఆర్‌ఓలను మినహాయించాలని మండలంలోని 19 గ్రామ సచివాలయాల పరిధిలోని వీఆర్‌ఓలు సోమవారం తహసీల్దార్ బీవీ రమణ, ఎంపీడీఓ బొలిలేని సురేష్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పామూరు 3వ సచివాలయం వీఆర్‌ఓగా విధులు నిర్వహిస్తున్న వాకమళ్ల మనోజ్‌కు ఆదేసచివాలయం ఇన్‌చార్జ్ పీఎస్‌గా విధులు నిర్వహిస్తున్న జి.రత్నకుమార్ పంచాయతీకి చెందిన ఇంటి పన్నులు ఆన్‌లైన్ చేయమని బాధ్యతలు అప్పగించారు. కాగా నిర్దేశిత సమయం లోగా వీఆర్‌ఓ మనోజ్ ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయకపోవడంతో ఇన్‌చార్జ్ పీఎస్ రత్నకుమార్ వీఆర్‌ఓ మనోజ్‌కు మెమో జారీ చేశారు. దీనిపై స్పందించిన వీఆర్‌ఓలు ఇప్పటికే తాము నీటి సంఘాల ఓటరుజాబితాలు తయారుచేయడం, జాతీయ రహదారి 167బీ, 565, నడికుడి కాళహస్తి రైల్వేలైన్ పనులు, కోర్టుకేసులు, ఫ్రీహోల్డ్ అసైన్‌మెంట్ ల్యాండ్ వెరిఫికేషన్, ఇతర రెవెన్యూ పనులతో తీవ్ర ఒత్తిడిలో ఉన్నామని, దీనికి తోడు పంచాయతీ పీఎస్‌ల పని తమకు అప్పగించి పూర్తికాలేదని మెమో ఇవ్వడం ఏంటన్నారు. సీసీఎల్‌ఏ సర్కులర్ ప్రకారం వీఆర్‌ఓలకు రెవెన్యూ విధులు తప్ప ఇతర విధులు అప్పగించడకూడదని సర్క్యులర్ ఇచ్చిఉన్నారన్నారు. దీనిపై స్పందించి వీఆర్‌ఓలకు పంచాయతీ సేవ లచి తప్పిస్తూ లేఖ పూర్వకంగా వారికి తెలియజేయాలని తహసీల్దార్, ఎంపీడీఓకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీఆర్‌ఓలు కుమార్, మనోజ్, శ్రీను, వెంకటస్వామి, రఫి, రమేష్, సరస్వతి తదితరులు ఉన్నారు.

వర్షం..వరికి ఎంతో మేలు

సింగరాయకొండ: ఫెంగల్ తుఫాన్ కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు సింగరాయకొండ, జరుగుమల్లి మండలాల్లో వరికి ఎంతో మేలని వ్యవసాయాధికారులు తెలిపారు. మండలంలో 35.4 మిల్లీమీటర్లు, జరుగుమల్లి మండలంలో 38.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం మండలంలో సుమారు 1,200 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారని ఏఓ సుధాకర్ వివరించారు. చెరువుల్లో పుష్కలంగా నీరు చేరటంతో రైతులు వరిసాగులో నిమగ్నమయ్యారు.

వైభవంగా నారాయణస్వామి పల్లకీసేవ



పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో సోమవారం స్వామి ఉత్సవమూర్తికి పల్లకిసేవ వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి ఆలయంలో అర్చకులు విశిష్ట పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ ఎస్‌జీఆర్.నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, బయ్యసానిమధు, భక్తులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆదాయం రూ.1.04 లక్షలు

మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,04,670 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఎస్‌జీఆర్. నరసింహబాబు సోమవారం తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.50,710, లడ్డుప్రసాదాల అమ్మకంద్వారా రూ.22,480, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.22,480, ఇతర విరాళాల కింద రూ.9 వేలు వచ్చినట్లు పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి



సాయిబాబా దేవస్థానంలో ప్రత్యేక పూజలు

కనిగిరిరూరల్: పోలి పాడ్యమి వేడుకలను కనిగిరిలో సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జాము నుంచే మహిళలు శివాలయాలకు వెళ్లి విశిష్ట పూజలు చేశారు. స్థానిక దొరువు వద్ద ఉన్న కొనేరు ప్రమిదల్లో దీపాలు వెలిగించి వదిలారు. అలాగే స్థానిక సాయిబాబా దేవస్థానంలో భవాని శంకరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ నాయకులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మా, వీసీ రామశాస్త్రి, ఏసీ చెంచులు, మండ్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.



కోనేరులో దీపాలు వదులుతున్న మహిళలు

టంగుటూరులో కుండపోత వర్షం

టంగుటూరు: తుఫాన్ ప్రభావంతో సోమవారం కుండపోత వర్షం కురవడంతో రహదారులు జలమయ్యాయి. ఈ వర్షంతో గ్రామాల్లో, పొగాకు బోర్డు వద్ద రోడ్డు వర్షం నీటితో నిండిపోయాయి, తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న పోతుల చెంచయ్య మెస్టు కాలనీలో రోడ్లపైకి, ఇళ్లలోకి వర్షం నీరు చేరాయి. టంగుటూరు కొండపి జాతీయ రహదారి ఫ్లైఓవర్ కింద భారీగా వర్షం నీరు చేసి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వర్షం కొంత మేర మేలు చేస్తుందని ఏఓ స్వర్ణలత తెలిపారు.



వర్షం నీటిలో జలమయమైన కొండపి ఫ్లైఓవర్